537) ముఖారి

ప॥ గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు। పరమపద మొక్కటే ఫలమింతే కాక ॥

చ॥ పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు। దాప నవి నిమిషమాత్రములేకాక।
లోపలేడ వెలియాడ లోకులకింతేకాక। మోపినదంతా యేకముఖమేకాక ॥

చ॥ రాతిరేది పగలేది రమించు సాత్వికులకు। యీతల నింతా వెలుగింతేకాక।
ఘాతల గర్మాకర్మగతులు యీసంది వింతే। పోతరించి యెక్కనెక్క బొడవేకాక ॥

చ॥ చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని। వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు।
జంతువుల పురుడులు జడులకింతేకాక। వింతవింతసుద్దులేల విభవమేకాక ॥